నమ్మక ద్రోహాన్ని రైతులు సహించరు

- వెన్నుపోటు సీఎంకు గుణపాఠం తప్పదు
- కౌలురైతులకు భరోసా ఇవ్వకుంటే పుట్టగతులుండవ్
- మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతులు దేన్నైనా క్షమిస్తారు కానీ నమ్మక ద్రోహాన్ని మాత్రం సహించరని, అధికారమే పరమావధిగా రైతు భరోసా పేరుతో హామీలిచ్చి రైతులను, కౌలు రైతులను వెన్నుపోటు పొడుస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌కు గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని నిసిగ్గుగా చెప్పిన కాంగ్రెస్ సర్కారుకు పుట్టగతులుండవని మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో రైతులు, కౌలు రైతులే తేల్చుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొనటాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులను నమ్మించి తడిగుడ్డతో గొంతు కోసిందని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మొన్న రుణ మాఫీ పేరిట మోసం, నిన్న వానాకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టారు. నేడు కౌలు రైతుకు భరోసా ఇవ్వలేమని చేతులెత్తేస్తారా? కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? 420 హామీల్లో సీఎం ఒక్కో వాగ్దానాన్ని పాతరేస్తున్నారు' అంటూ దుయ్యబట్టారు. చేతకానప్పుడు హామీలివ్వడమెందుకు ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నయవంచనకు పరాకాష్ట అని విమర్శించారు. అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేసి గద్దెనెక్కాక గొంతుకోసిన వారిని రైతులు అస్సలు వదిలిపెట్టరని, ఈ వెన్నుపోటుకు సీఎం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.



తన కుమారుడు భార్గవ్ వివాహానికి హాజరు కావాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య

కొండా లక్ష్మణ్‌బాపూజీ తెలంగాణకు నిత్యస్ఫూర్తి

- ఆయన పట్టుదల, రాజనీతిజ్ఞత ప్రభావితం చేశాయి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలి తరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన తెలంగాణకు నిత్యస్ఫూర్తి అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి తాను సాగించిన చివరిదశ తెలంగాణ సాధన పోరాటంలో ఇమిడి ఉన్నదని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి (శనివారం)ని పురస్కరించుకుని వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ కోసం తాను బయలుదేరిననాడు నాటి ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ వ్యతిరేక ప్రభుత్వాల ఒత్తిడికి తలొగ్గకుండా బాపూజీ తన జలదృశ్యం నివాసాన్ని ఉద్యమవేదికగా నిలపడం తన తెలంగాణ పోరాట ప్రస్థానంలో మరిచిపోలేనిదని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. బాపూజీ ప్రదర్శించిన నిక్కచ్చితనం, నిరాడంబరత లక్ష్య సాధనకోసం కనబరిచిన పట్టుదల తననెంతో ప్రభావితం చేశాయని తెలిపారు. న్యాయవాదిగా, రాజనీతిజ్ఞుడిగా స్వాతంత్రోద్యమకాలం నుంచి రాష్ట్ర సాధన చివరిదశ దాకా బాపూజీ చేసిన కృషిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్మారకార్థం పలు కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కొనసాగిన బీఆర్ఎస్ పదేండ్ల ప్రగతి పాలనలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల కొనసాగింపు ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు.

కడియంకు గుణపాఠం తప్పదు

ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ శ్రేణులే బుద్ధిచెప్తరు ● స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎగిరేది గులాబీ జెండానే ● త్వరలో విస్తృతస్థాయి సమావేశం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంపై మరోసారి గులాబీ జెండా ఎగరటం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. పార్టీ మారిన ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హతవేటు ఖాయమని, త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు రానున్నాయని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఉప ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీని మోసం చేసి, ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి రాజకీయ స్వార్థంతో పార్టీ మారిన కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓడించేందుకు ప్రజలు, అన్ని స్థాయిల గులాబీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు రాజయ్య వివరించారు. అనేక అవకాశాలు ఇచ్చినా, మూడు సార్లు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించినా కేవలం రాజకీయ స్వార్థంతో పార్టీని వీడిన కడియం శ్రీహరికి

గులాబీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో బుద్ధిచెప్తారని కేటీఆర్ స్పష్టంచేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ పార్టీ ఎన్నికల అభ్యర్థిగా ఇప్పటికే అధినేత కేసీఆర్ తాటికొండ రాజయ్య పేరును ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయడం కోసం త్వరలోనే నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్టు కేటీఆర్ తెలిపారు. త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక నాయకులతో చర్చించి సమావేశ తేదీలను నిర్ణయించాలని రాజయ్యకు సూచించారు.

సర్కార్ దుర్భర వైద్యసేవలపై బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ

- మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఎమ్మెల్యే సంజయ్, మెతుకు ఆనంద్‌తో కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మాతా, శిశు మరణాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న దుర్భర వైద్య ఆరోగ్య పరిస్థితులపై బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ వేసింది. కమిటీని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య నేతృత్వంలోని కమిటీలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గాంధీ వైద్యశాలతో పాటు రాష్ట్రంలోని పలు దవాఖానలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నిర్మాణాత్మక సూచనలతో కూడిన నివేదికను రూపొందిస్తారని, ఆ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని కేటీఆర్ తెలిపారు.

నేరపూరిత నిర్లక్ష్యం

- మృతదేహం తరలింపునకు వాహనం లేకపోవడం అమానుషం
- ప్రభుత్వ తీరును ఎక్స్ వేదికగా ఎండగట్టిన మాజీ మంత్రి కేటీఆర్

ములుగు, సెప్టెంబర్ 20 (నమస్తేతెలంగాణ): మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్‌లు లేకపోవడం అమానుషమని, ఇది నేరపూరిత నిర్లక్ష్యమని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును కేటీఆర్ ఎక్స్ వేదికగా ఎండగట్టారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపురం గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్ కుమార్తె గీతిక(6) జ్వరంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎంలో గురువారం మృతి చెందింది. పాప మృతదేహాన్ని ఇంటికి తేవడానికి ప్రభుత్వ వాహనం అందుబాటులో లేకపోవడంతో బీఆర్ఎస్ నేత భూక్యా జంపన్న సొంత ఖర్చులతో ప్రైవేటు అంబులెన్స్‌ను సమకూర్చారు. విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా చిన్నారి మృతిపై సంతాపం వ్యక్తం చేసి మృతదేహాన్ని తరలించే స్థితిలో లేని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఘటన అవమానకరమని పేర్కొన్నారు. జీవితంలో ఉన్న పరువు చావులో లేదని, ఇదే సీఎం రేవంత్‌రెడ్డి వైద్యం అని, ఇది ఎవరికి అర్హత లేని నేరపూరిత నిర్లక్ష్యం అంటూ కేటీఆర్ పోస్టులో పేర్కొన్నారు.



KTR @KTRBRS

Inhumane! At Warangal MGM Hospital, a grieving family carried the body of 6-year-old Geetika in their arms for 3 hours due to no ambulance.

Shame on the Congress Govt! Not only this Government has managed to turn govt hospitals into death traps but the state's healthcare system is also crumbling under his watch.

This is CM Revanth Reddy's healthcare model, no dignity in life, no dignity in death. This is criminal neglect that no one deserves.

ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ఎండగడుతూ కేటీఆర్ చేసిన పోస్టు

సీబీఐ దర్యాప్తు జరపాలి

సీబీఐ విచారణ జరపకపోతే మీరంతా ఒక్కటే!

కేంద్రం నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే దక్షిణ భాగాన్ని చేపట్టాలి. అప్పుడే కేంద్రం నుంచి తెలంగాణకు రూ.12,500 కోట్ల సాయం అందుతుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని, పాత అలైన్‌మెంట్ ప్రకారమే దక్షిణ భాగం పనులు మొదలయ్యేలా చూడాలి. నష్టపోతున్న పేద రైతుల బాధలు అర్థం చేసుకోవాలి. గిరిజనుల బాధ తెలుసుకోవాలి. కొత్త అలైన్‌మెంట్ చాలా బాగుందని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే పారదర్శకంగా శ్వేత పత్రం విడుదల చేయాలి. కొత్త అలైన్‌మెంట్ మారడం వల్ల నష్టపోతున్న గ్రామాల్లో సభలు నిర్వహించి, అక్కడి ప్రజల బాధలు తీర్చాలి. ఆ రైతులకు మంచి నష్టపరిహారం ఇచ్చి ప్రాజెక్టును చేపట్టాలి. కానీ మీ భూముల కోసం, ఆ భూముల ధరలు పెంచుకునేందుకు నిరుపేద రైతులు, గిరిజనులు, రాష్ట్రాన్ని బలిపెట్టి అప్పులఊబిలోకి తీసుకుపోతామంటే మాత్రం బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అలైన్‌మెంట్ మార్పు ఎవరి కోసం? ఎవరి భూముల ధరలు పెరగడానికి? ఏ గద్దల భూదందా జరగడానికి? అనేది బయటకు రావాలి. అంటే.. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరుతున్నా. దీని వెనకాల ఎవరి హస్తం ఉందనేది ప్రజలకు తెలియాలి. పేద రైతులను బెదిరించటంపైనా సీబీఐ విచారణ జరగాలి. లేకపోతే బండి సంజయ్, కిషన్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి ఒక్కటేనని.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని తెలంగాణ ప్రజలు నమ్ముతరు' అని పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో కిషోర్ గౌడ్, శభప్రదపటేల్, రాకేశ్ కుమార్, స్వామి యాదవ్ తదితరులు

III తరువాయి...

మొత్తం అలైన్‌మెంట్ మారకుండా కేవలం కాంగ్రెస్, ప్రభుత్వ పెద్దలకు సంబంధించి వందల ఎకరాల భూములు ఉన్నచోటే ఎందుకు మారింది? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల నుంచే పేద రైతులు దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న కుందారం భూములు బిగ్ బ్రదర్స్ ఖాతాలోకి పోతున్న వైనాన్ని ఎండగట్టారు. ఆ కుందారం భూముల సమీపంలోకే రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ పరుగులు పెట్టడం వెనుక ఆంతర్యమేమిటి? అని ఎండగట్టారు. కేవలం ప్రభుత్వ పెద్దల భూముల ధరలు పెంచుకునేందుకే అలైన్‌మెంట్ మార్పు కుట్ర జరుగుతున్నదని కుండబద్దలు కొట్టారు. మార్పు వల్ల కేంద్రం నుంచి తెలంగాణకు రూ.12,500 కోట్ల నిధులు రాకున్నా.. ప్రపంచ బ్యాంకు రుణంతో ఆ ప్రాజెక్టును చేపట్టి తమ భూముల ధరలు పెంచుకునే మహా పన్నాగాన్ని రేవంత్ ప్రభుత్వం రచించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టడంతో పాటు అమాయక, పేద రైతుల భూములను చీల్చుతున్న, కొల్లగొడుతున్న ఈ అరాచక వ్యవహారంపై వెంటనే కేంద్రం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వెంటనే సీబీఐ విచారణ వేయించాలని, లేకపోతే బీజేపీ-కాంగ్రెస్ ఒకటేనని తెలంగాణ ప్రజలు నమ్మాల్సి వస్తుందని హెచ్చరించారు. మీడియా సమావేశ వివరాలు వేముల మాటల్లోనే..

ఆర్ఆర్ఆర్ కథ ఇదీ..

అంతకుముందు వాహనాలు జాతీయ రహదారుల మీదుగా ఢిల్లీ, బెంగళూరు, ముంబైకి వెళ్లాలంటే హైదరాబాద్ సిటీ నుంచి వెళ్లాయి. నగర ట్రాఫిక్‌పై తీవ్ర ఒత్తిడి పెరగటంతో అప్పట్లో ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆ వాహనాలన్నీ ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా వెళ్లేవి. కాలక్రమేణా ఆ ఇన్నర్ రింగు రోడ్డు కూడా నగర ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది. అనంతరం ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి 20-25 కిలోమీటర్ల దూరంలో ఔటర్ రింగ్ రోడ్డు కట్టి.. జాతీయ రహదారుల మీదుగా వచ్చే వాహనాలన్నింటినీ ఈ ఔటర్ రింగ్ రోడ్డు మీదికి మళ్లించారు. ఆ సమయంలో తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హైదరాబాద్ ఇంకా విస్తరిస్తుందన్న దూరదృష్టితో ఆలోచించిన అప్పటి సీఎం కేసీఆర్.. నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో కొత్త ఎకనామిక్ జోన్ ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. అందుకు ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రతిపాదనలు రూపొందించారు. దాన్ని జాతీయ రహదారిగా పరిగణించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న జాతీయ రహదారులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని.. ఆర్ఆర్ఆర్‌ను జాతీయ రహదారిగా నిర్మాణం చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. కేంద్రం ప్రాజెక్టును చేపడితే కేంద్ర అధికార యంత్రాంగమే అలైన్‌మెంట్ వంటి ప్రక్రియను నిర్వహిస్తుంది. నిర్ధారణ అయ్యాక రాష్ట్రానికి పంపి సమ్మతమేనా? అని మాత్రమే అడుగుతుంది.

లాభనష్టాలు బేరీజు వేసుకున్నరు

తొమ్మిది నెలల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి సంబంధించిన ఫైల్ ఆమోదం కోసం కేంద్రం వద్ద ఉన్నదన్న విషయం ఈ ప్రభుత్వానికి తెలుసు. అందుకే గతంలోనే ఫైనల్ అయిన అలైన్‌మెంట్ వల్ల తమకేం లాభం అనుకొన్నరు. తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నయో చూసుకున్నరు. అట్ల బేరీజు వేసుకొని అనేక మంది పేద రైతుల భూముల్లోకి అలైన్‌మెంట్ మళ్లించి, వారి భూములను చీల్చి అలైన్‌మెంట్‌ను వాళ్ల భూముల దగ్గరకు మలుపుకున్నరు. కొన్ని నెలలుగా ఈ ప్రభుత్వం అదే పని మీద ఉన్నది. అలైన్‌మెంట్ మార్పు మీద ఇటీవల ఒక ప్లాన్ కూడా రిలీజ్ చేసినరు.

ప్రభుత్వ పెద్దల స్వలాభం కోసమే

158 కిలోమీటర్ల ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి రూ.4 వేల కోట్లు భూసేకరణ, రూ.8-9వేల కోట్లు రోడ్డు వేయడానికి ఖర్చవుతుండగా, అందులో భూసేకరణలో సగం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని కేసీఆర్ సర్కారు కేంద్రానికి స్పష్టం చేస్తే కేంద్రం కూడా అంగీకరించింది. 189 కిలోమీటర్ల దక్షిణ భాగం భూసేకరణకు రూ.5 వేల కోట్లు, రోడ్డు వేసేందుకు రూ.10 వేల కోట్లు అవసరమవుతుంది. కేంద్రం గతంలో అంగీకరించిన ప్రకారం దక్షిణభాగానికి సంబంధించి భూసేకరణలో సగం అంటే రూ.2,500 కోట్లు రాష్ట్రం ఇస్తే సరిపోతుంది. మిగిలిన రూ.12,500 కోట్లు కేంద్రమే ఇస్తుంది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం వేరే విధంగా ఆలోచిస్తున్నది. గతంలోనే నిర్ణయించిన అలైన్‌మెంట్ వల్ల తమకు ఏం లాభం లేదనుకొని, వాళ్ల భూముల దగ్గరకు రింగ్‌రోడ్డును తీసుకుపోవాలని కొత్త అలైన్‌మెంట్ ఇచ్చుకున్నారు. అందులోనే భారీ ఎత్తున ప్రభుత్వ పెద్దల స్వలాభం దాగి ఉన్నది.

- నాగార్జునసాగర్ జాతీయ రహదారిలో మాల్ సమీపంలోని గొల్లపల్లి వద్ద పాత అలైన్‌మెంట్ ఉంటే.. దాన్ని రెండు కిలోమీటర్లు బయటికి జరిపి కుర్మపల్లి ఎక్స్ రోడ్డు దగ్గర అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.
- శ్రీశైలం జాతీయ రహదారిలో గత అలైన్‌మెంట్ ప్రకారం ఆమన్‌గల్ కాటన్ మిల్లు సమీపంలో ఉంటే దాన్ని 3-4 కిలోమీటర్లు శ్రీశైలం హైవే వైపు జరిపారు. ఆమన్‌గల్‌ను దాటి మేడిగడ్డ తండా దగ్గరికి మార్చారు. మరి ఎందుకు మార్చారని మీడియా, ప్రజలు అడిగితే.. ఫ్యూచర్ సిటీ కోసం అలైన్‌మెంట్‌ను మారుస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే.. లేమూరు-యాచారం-కొత్తూరు-ముచ్చర్ల పరిధిలో ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీ విస్తరించి ఉన్నది. ఈ క్రమంలో పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే ఈ ఫోర్త్ సిటీకి ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ 10 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. కానీ ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం 2 కిలోమీటర్లు పెరిగి 12 కిలోమీటర్ల దూరంలోకి పోయింది. సాగర్ హైవేపై చూస్తే.. ఫోర్త్ సిటీ నుంచి గొల్లపల్లి 20 కిలోమీటర్ల వరకు ఉంటే ఇప్పుడు రెండు కిలోమీటర్లు అవతలికి జరిగి దూరం ఇంకా పెరిగింది. అంటే ఫ్యూచర్ సిటీ కోసం అలైన్‌మెంట్ మార్చారు అన్నది శుద్ధ అబద్ధం.

మరెందుకు మార్చారు?

- శ్రీశైలం హైవే వైపు అలైన్‌మెంట్ మార్చడానికి కారణం.. కుందారం భూములు. ఈ భూములను దశాబ్దాలుగా పేద రైతులు సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు లేవు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఆ రైతుల నుంచి చాలా అగ్గువకు ఆ భూములను బెదిరించి తీసుకున్నారు. అక్కడి రైతులను అడిగితే మాత్రం బిగ్ బ్రదర్స్ అని చెప్తున్నరు. అదెలాగంటే.. కబ్జా రద్దు ఒప్పంద పత్రాలు అని స్టాంపు పేపర్ల మీద రాయించుకుంటున్నరు. ప్రభుత్వం వచ్చిన మరుసటి నెల నుంచే పేద రైతులను బయటికి పంపించి కుందారం భూములను ఆక్రమించడం మొదలుపెట్టారు. గద్దల్లా వచ్చి వారిని భయపెట్టి రూ.40-50 లక్షలుంటే రూ.3-4 లక్షలకు గుంజుకుంటున్నరు. 30 ఏండ్ల నుంచి వ్యాపారంలో ఉన్న బిల్డర్‌ను నేను. ఇప్పటివరకు కబ్జా రద్దు ఒప్పంద పత్రం అనేది చూడలేదు.
- గతంలోని అలైన్‌మెంట్‌ను మార్చి ఖానాపూర్ సమీపంలోకి తీసుకువచ్చారు. అది ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే గ్రామం. ఆయనకు అక్కడ సొంతంగా కొనుగోలు చేసిన (ఈ ఏడెనిమిది నెలల కాలంలో) భూములు ఉన్నాయి.
- పాత అలైన్‌మెంట్‌ను మరిన్ని కిలోమీటర్లు ముందుకు జరిపి మాడ్గులలోని నల్లచెరువు వద్దకు అలైన్‌మెంట్‌ను తీసుకుపోయారు. మాడ్గులలో సీఎం రేవంత్‌రెడ్డి బంధువులకు పెద్ద ఎత్తున భూములు ఉన్నాయనేది అందరికీ తెలుసు.
- చేవెళ్ల సమీపంలోని ఇంతకుముందు అంగడి చిట్టంపల్లి గేటు సమీపంలో అలైన్‌మెంట్ ఉంటే దానిని ఐదు కిలోమీటర్లు ముందుకు జరిపి మన్నెగూడ క్రాస్‌రోడ్డు నుంచి తీసుకుపోతున్నరు. దానివల్ల షాద్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సంగారెడ్డి వరకు ముందుకు జరపటం వల్ల అక్కడ ఉన్న మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీమంత్రి, చాలామంది కాంగ్రెస్ నాయకులకు ల్యాండ్ బ్యాంక్ ఉండటం వల్ల మేలు జరుగుతుందని ప్రజలే అంటున్నరు. అంతేకాదు.. ఈ ప్రాంతంలో కూడా బిగ్ బ్రదర్స్ స్వయంగా భారీఎత్తున భూములు సేకరించి పెట్టుకున్నారని స్థానికులు చెప్తున్నారు. అందుకే అలైన్‌మెంట్ మార్చారు.

అక్కడే ఎందుకు జరిగింది?

గత అలైన్‌మెంట్ హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని అనుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు 50 కాదు.. 60 కిలోమీటర్ల దూరం వరకు ఆర్ఆర్ఆర్ కావాలనుకుంటే దక్షిణ భాగం మొత్తం ఆ మేరకు 10 కిలోమీటర్లు పాత అలైన్‌మెంట్ ముందుకు జరగాలి. కానీ కేవలం నాలుగైదు చోట్ల ఎంపిక చేసినట్టు మాత్రమే ఎందుకు జరిగింది? దీని వెనక మతలబు ఏంది? కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు, పార్టీ నేతల భూములతో పాటు ప్రభుత్వం వచ్చిన తర్వాత వాళ్లు పేదల్ని భయపెట్టి, రెవెన్యూ లొసుగులను ఆసరాగా చేసుకొని ఎక్కడెక్కడ భూముల్ని చవకగా గుంజుకున్నరో ఆయా ప్రాంతాల్లోనే రింగు రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చే ప్రయత్నం చేశారు.

తెలంగాణను ముంచి..

వాళ్ల భూముల ధరలు పెంచి..

కేంద్రం అలైన్‌మెంట్ ప్రకారం దక్షిణ భాగం నిర్మాణం చేపడితే కేంద్రం నుంచి రూ.12,500 కోట్లు వస్తాయి. కానీ అలైన్‌మెంట్‌ను ఇష్టమొచ్చినట్టు మారిస్తే నిధులు ఇవ్వరు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు కొందరు తమ స్వలాభం కోసం అలైన్‌మెంట్ మార్చారని తెలిస్తే ప్రాజెక్టును కేంద్రం చేపట్టకపోవచ్చు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నవారికి తెలుసు. అయినప్పటికీ ప్రభుత్వం ముందుకుపోతున్నది. ఎందుకంటే.. మాకున్న సమాచారం ప్రకారం కేంద్రం రూ.12,500 కోట్లు ఇవ్వకున్నా.. తెలంగాణ ఆ నిధులు నష్టపోయినా సరే! రింగ్ రోడ్డు మాత్రం మా భూముల గుండానే పోవాలి. అలైన్‌మెంట్ మార్చాల్సిందే అని అనుకుంటున్నరు. కేంద్రం నిధులు ఇవ్వకున్నా ప్రపంచ బ్యాంకు లోన్ తీసుకుందామనుకుంటున్నరు. తెలంగాణపై రూ.12,500 కోట్ల భారం మోపైనా రింగ్ రోడ్డును తమ భూముల గుండా తీసుకుపోవాలి.. ఆ భూముల ధరలు పెరగాలనేది ఈ ప్రభుత్వ ఆలోచనగా ఉన్నది.

ఎలాంటి జోక్యం లేకుండానే ఉత్తర-దక్షిణ అలైన్‌మెంట్లు పూర్తి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్తర-దక్షిణ భాగాలకు ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను కేంద్రమే పూర్తిచేసింది. అందులో ఎలాంటి రాజకీయ జోక్యంగానీ, తెలంగాణ ప్రభుత్వ జోక్యంగానీ లేదు. కేంద్రం నుంచి అలైన్‌మెంట్ ప్రతిపాదనలు వస్తే కొన్ని అభ్యంతరాలను అప్పట్లో చెప్పాం. ముఖ్యంగా అలైన్‌మెంట్ సర్వే సమయంలోలేని బస్వాపూర్ రిజర్వాయర్‌తో కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు కాల్వలు, జలాశయాలు వచ్చే చోట కొంత అలైన్‌మెంట్ తప్పించాలని చెప్పాం. అది సహేతుకం కావడంతో వాటిని మార్పు చేశారు. అలైన్‌మెంట్ విషయంలో ఏ ఒక్క రైతు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. కేంద్రం తొలుత ఉత్తర భాగం చేపడతామని చెప్పటంతో ఆ మేరకు అలైన్‌మెంట్‌ను అధికారికంగా నిర్ధారించి, భూసేకరణ కూడా 30-50 శాతం వరకు పూర్తి చేశారు. దక్షిణ భాగం అలైన్‌మెంట్ కూడా ఖరారైనందున దాన్ని కూడా వెంటనే చేపట్టాలని అప్పట్లోనే మేం కోరటంతో దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్‌ను కూడా పరిశీలించి, అభ్యంతరాలుంటే చెప్పాలని అన్నారు. మేం దానిని పరిశీలించి, నల్లగొండ జిల్లాలో డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే శివన్నగూడెం రిజర్వాయర్ వచ్చే చోట అలైన్‌మెంట్ వస్తున్నందున దాన్ని తప్పించాలని సూచించటంతో ఆ మేరకు మార్పు చేశారు. అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేశారు. దానికి సంబంధించిన ఫైల్ కేంద్రం వద్దే ఉన్నది. అయితే ఆ ప్రాజెక్టును భారత్‌మాల కింద చేపట్టాలా? మరో పథకమా? అని పరిశీలిస్తున్నారని తెలిసింది.

నిర్యాణము
కీ॥శే॥ బద్దుల సత్యనారాయణ యాదవ్ గారు
మరణం: 20-09-2024 (94 సం॥లు)
మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్న మీరు మా నుండి దూరమైనారు.
మీరు లేని లోటు మాకు తీరనిది. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
వారి అంత్యక్రియలు తేది.21-9-2024 మ॥ 12 గం॥లకు
మా స్వగృహము నింబోలి అడ్డ నుండి హరస్‌పెంటా
(కాచిగూడ) స్మశాన వాటిక నందు జరుపబడును.
ఇట్లు
తమ్ముళ్ళు